

'ఉపాధ్యాయుడు ఎన్నికల ప్రచారం చేయలేదు'

కాకినాడ: కాజులూరు మండలం కుయ్యేరు జడ్‌పి ఉన్నత పాఠశాలలో శనివారం జరిగిన క్లస్టర్ సమావేశంలో ఉపాధ్యాయుడు నున్నపునేని గణేష్ నిబంధనలకు విరుద్ధంగా ఎన్నికల ప్రచారం చేసారంటూ చేస్తున్న ప్రచారంలో వాస్తవం లేదని యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సిహెచ్.సూరిబాబు, కెవివి నగేష్, సదరు ఉపాధ్యాయుడు గణేష్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిబంధనలకు విరుద్ధంగా సమావేశంలో ఎన్నికల ప్రచారం చేసారని కొన్ని పత్రికలలో వచ్చిన వార్తలను ఖండిస్తున్నామన్నారు. ఎంఎల్‌సి ఎన్నికల్లో పోటీ చేస్తున్న కొందరు అభ్యర్థుల మద్దతుదారులు ఉపాధ్యాయుల క్లస్టర్ సమావేశాల సందర్భంగా కరపత్రాలు పంపిణీ చేశారని, దానిలో భాగంగా గణేష్‌కి కూడా ఒక కరపత్రం ఇచ్చారని తెలిపారు. అంతే తప్ప గణేష్ నిబంధనలకు విరుద్ధంగా ఎన్నికల ప్రచారం నిర్వహించలేదని తెలిపారు.

యథేచ్ఛగా సారా అమ్మకాలు

- ప్రాణాలను హరిస్తున్నా పట్టని ప్రభుత్వం
- చోద్యం చూస్తున్న యంత్రాంగం
- అరకొర చర్యలకే పరిమితం

ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

యు. కొత్తపల్లి మండలం కొండెవరంకు చెందిన మంగం విజయరాజు (32) గత కొంత కాలంగా నాటు సారాకు అలవాటు పడి 10 నెలల క్రితం ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. వైద్యుల వద్దకు తీసుకెళ్లగా అప్పటికే మరణించినట్లు ధ్రువీకరించారు. అతనికి వివాహం కాలేదు. తరచూ నాటు సారా తాగడం వలన పచ్చకామెర్లు వచ్చి చనిపోయాడని కుటుంబ సభ్యులు తెలిపారు. చేదోడు వాదోడుగా ఉండే తమ కుమారుడు సారా రక్కసికి అలవాటు పడి మరణించడం పట్ల తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. నేటికీ కొడుకు జ్ఞాపకాలను మరవలేకపోతున్నామని వారు కన్నీటిపర్యంతం అయ్యారు. ఇదే మండలంలోని రమణక్కపేట గ్రామానికి చెందిన యేసు సారాకు బాగా అలవాటు పడి తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్నాడు. మంచాన


పెద్దాపురంలో బెల్లపు ఊటను ధ్వంసం చేస్తున్న ఎక్సైజ్ సిబ్బంది(ఫైల్ ఫోటో)

పడి లేవలేని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నాడు. భార్య, ఇద్దరి చిన్నారులు అతని పరిస్థితి చూసి నిత్యం రోదిస్తూనే ఉన్నారు. ఇలా ఎన్నో కుటుంబాల్లో సారా మహమ్మారి కారణంగా మృతి చెందుతున్నారు. మంచాన పడుతున్నారు. కుటుంబాన్ని వీధుల పాలు చేస్తున్నారు. అయినా ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. అధికార యంత్రాంగం నిమ్మకునీరెత్తినట్లున్నట్లుగానే వ్యవహరిస్తోంది.

కాకినాడ జిల్లాలో పల్లెలు, పట్టణాలు అనే తేడా లేకుండా నాటుసారా విచ్చలవిడిగా ఎక్కడపడితే అక్కడ లభిస్తుంది. జిల్లాలో పిఠాపురం, తుని, యు.కొత్తపల్లి, తొండంగి, కోటనందూరు, శంఖవరం, ఏలేశ్వరం, తాళ్లరేవు తదితర మండలాల్లో యథేచ్ఛగా సారా తయారీ జరుగుతోంది. ప్రధానంగా తీర ప్రాంత మండలాల్లో తయారీ ఎక్కువగా ఉంది. తుని నియోజకవర్గ పరిధిలోని హంసవరం, కొత్తూరు, లోవ కొత్తూరు, తాళ్లూరు, తొండంగి మండలంలోని అద్దరిపేట, పంపాదిపేట, వేమవరం, ఒంటిమామిడి, కోటనందూరు మండలంలోని కాకినాడ జిల్లా అనకాపల్లి సరిహద్దు ప్రాంతమైన భీమవరపు కోట, సంఘవాక, అల్లిపూడి, రాజవరం, కొట్టాం తదితర గ్రామాల్లో సారా తయారీ విచ్చలవిడిగా జరుగుతుంది. రాష్ట్ర డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ ప్రాతినిధ్యం వహిస్తున్న పిఠాపురంలో కూడా సారా ఏరులై పారుతోంది. ముఖ్యంగా పిఠాపురం పట్టణంలో మొబైల్ సారా విక్రయాలు జోరుగానే సాగుతున్నాయి. రూరల్ ప్రాంతమైన కందరాడ, మల్లం, విరవాడ, విరవ, బి.కొత్తూరు, పి.దొంతమూరు ఇలా పలు గ్రామాల్లో సారా అమ్మకాలు నిత్యం జరుగుతున్నాయి. ఇటీవల మద్యం ధరలు పెరగడంతో మద్యానికి అలవాటు పడిన సామాన్యులు సారా వైపు మొగ్గు చూపుతున్నారు. మందుబాబుల అవసరాలను ఆసరాగా చేసుకుంటూ కొందరు సారా తయారీ, అమ్మకం దారులు రెచ్చిపోతున్నారు. ఇదే నియోజకవర్గ పరిధిలోని యు.కొత్తపల్లి మండలంలోని కొన్ని మారుమూల గ్రామాల్లో అక్కడక్కడ సారా తయారీ జరుగుతుంది. ఇక్కడ నుంచి పిఠాపురం, గొల్లప్రోలు మండలాల్లోని వివిధ ప్రాంతాలకు చిన్నచిన్న బడ్డీ దుకాణాలకు విక్రయాలకు కోసం సారాను పంపిణీ చేస్తున్నారు. తయారీదారులు రసాయనాలను వినియోగించి తక్కువ సమయంలో కల్తీ నాటు సారాను తయారుచేసి అమ్మకాలు జరుపుతున్నారు. దీంతో అనేకమంది ప్రాణాలు గాల్లో కలుస్తున్నాయి. గతంలో లీటరు సారా రూ.200 లోపు ఉంటే డిమాండ్ ఆధారంగా ప్రస్తుతం రూ.500 పైనే అమ్ముతున్నారు.

అరకొర చర్యలేనా...!

ఎన్ని దాడులు చేస్తున్నా కేసులు నమోదు చేసి అరెస్టులు చేస్తున్నా అక్రమ సారా తయారీ, అమ్మకాలు కొనసాగుతూనే ఉన్నాయి. దీనికి కారణం ఎక్సైజ్ అధికారులే. సారా అమ్మకందారులతో కుమ్మక్కవుతున్నారనే ఆరోపణలు గట్టిగానే వినిపిస్తున్నాయి. జిల్లాలో గతేడాది అక్టోబర్ 1 నుంచి ఈనెల 1 వరకూ 525 సారా కేసులను నమోదు చేసిన అధికారులు 182 మందిని అరెస్ట్ చేశారు. 3862 లీటర్ల సారాను స్వాధీనం చేసుకుని 3,23,500 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశారు. నల్ల బెల్లం రవాణాపై నిఘా ఉంచామని అధికారులు చెబుతున్నారు. ఇవన్నీ వెలుగులోకి వస్తున్న కేసులు మాత్రమే. అయితే ఇవన్నీ 20 శాతం మాత్రమే. వాస్తవానికి అంతకు మించి అన్నట్లుగా సారా వ్యాపారం సాగుతున్నా అధికారులు పట్టనట్లు వ్యవహరిస్తున్న తీరు అనుమానాలకు తావిస్తోంది.

సారాను అరికట్టకపోతే ఉద్యమం

సారా మహమ్మారి వలన అనేక పేదల జీవితాల్లో చీకట్లు అలుముకుంటున్నాయి. అక్రమంగా సారా తయారీ, అమ్మకాలు యథేచ్ఛగా సాగుతున్నా అధికారులు అంతగా పట్టించుకోవడం లేదు. దీనిపై అనేకసార్లు అధికారులకు, ప్రభుత్వానికి ఫిర్యాదులు చేస్తున్నా చర్యలు మాత్రం శూన్యం. సారా నియంత్రణకు ప్రభుత్వం పూర్తిస్థాయిలో చర్యలు తీసుకోవాలి. అలాగే మద్యం అమ్మకాలపై నియంత్రణ చేపట్టాలి. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తాం.

-ఎన్. సూర్యనారాయణ,
కన్వీనర్, మద్యపాన వ్యతిరేక పోరాట సమితి, కాకినాడ.


వాకర్స్‌ను కలిసి ఓట్లు అభ్యర్థిస్తున్న పిడిఎఫ్ ఎంఎల్‌సి అభ్యర్థి డి.వి.రాఘవులు

పిడిఎఫ్ ఎంఎల్‌సి అభ్యర్థి రాఘవులు విస్తృత ప్రచారం

ప్రజాశక్తి - కాకినాడ

ఫిబ్రవరి 27 న జరుగబోతున్న తూర్పు-పశ్చిమ గోదావరి పట్టభద్రుల నియోజకవర్గంలో యుటిఎఫ్, వివిధ ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్, ప్రజా సంఘాల బలపరిచిన పిడిఎఫ్ అభ్యర్థి దిడ్ల వీర రాఘవులు ఆదివారం నగరంలో విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. నగరంలో వివిధ ప్రభుత్వ, ప్రయివేటు రంగాల్లో పని చేస్తున్న పట్టభద్రులను కలుసుకుని శాసన మండలిలో పిడిఎఫ్ ఎంఎల్‌సిలు చేస్తున్న కృషిని వివరించారు. అధికార, ప్రతిపక్షాల వైపు కాకుండా పిడిఎఫ్ నిరంతరం ప్రజాపక్షం నిలబడుతుందన్నారు. 2007 శాసనమండలి పునరుద్ధరణ జరిగినప్పటి నుంచి ఇప్పటివరకు 17 మంది పిడిఎఫ్ ఎంఎల్‌సిలు శాసన మండలికి వన్నె తెచ్చారని తెలిపారు. ఆదిఎరం ఉదయం నగరంలో వివిధ ప్రాంతాల్లో వాకర్స్‌ను కలుసున్న రాఘవులు తన ఉద్యమ నేపథ్యాన్ని స్వయంగా వివరించారు. ప్రస్తుత ఎంఎల్‌సి ఇళ్ళ వెంకటేశ్వరరావు (ఐవి) స్థానంలో తనను పట్టభద్రుల ఎంఎల్‌సి అభ్యర్థిగా ప్రతిపాదించారని రాఘవులు తెలిపారు. కాకినాడ నగరం పరిసర ప్రాంతాల్లో ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్, మహిళలతో పాటు ముఖ్యంగా నిరుద్యోగ పట్టభద్రులు దిడ్ల వీర రాఘవులుకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ ప్రచారంలో ప్రజా సంఘాల నాయకులు పలివెల వీరబాబు, కె.సత్తిరాజు, మలక వెంకటరమణ, బొజ్జా అశోక్, వై. నాగేశ్వరరావు, బుర్రా సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కాకినాడలో కార్డన్ సెర్చ్

ప్రజాశక్తి - కాకినాడ

నగరంలోని 12వ డివిజన్ స్వర్ణాంధ్ర కాలనీలోని టిడ్కో గృహ సముదాయంలో ఆదివారం తెల్లవారుజాము 3 గంటల నుంచి ఎఎస్‌పి దేవరాజ్ పాటిల్ ఆధ్వర్యంలో పోలీసులు కార్డెన్ సెర్చ్ ఆపరేషన్ చేపట్టారు. ఈ ఆపరేషన్‌లో రికార్డ్స్ లేని టూవీలర్ వెహికల్స్‌ను సీజ్ చేసి పోర్టు పోలీస్ స్టేషన్‌కు తరలించారు. కొన్ని గృహాలలో హిజ్రాలు అద్దెకు ఉంటూ అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడుతున్న హిజ్రాలను ఎఎస్‌పి కౌన్సిలింగ్ ఇచ్చారు. అసాంఘిక కార్యక్రమాలను వీడకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐ సునీల్‌కుమార్, ఎస్‌ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.


టిడ్కో గృహ సముదాయం వద్ద తనిఖీలు చేస్తున్న పోలీసులు

17 నుంచి తాగు నీటి సరఫరా నిలుపుదల

ప్రజాశక్తి - కాకినాడ

అచ్చంపేట జంక్షన్ నుంచి సామర్లకోట వరకు చేపట్టిన ఎడిబి రోడ్డు పనుల కారణంగా ఈ నెల 17 నుంచి 20వ తేదీ వరకూ మంచినీటి సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు నగర పాలక సంస్థ కమిషనర్ భావన ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. సామర్లకోట నుంచి శశికాంత్ నగర్ ఫిల్టరేషన్ ప్లాంట్‌కు తాగునీరు సరఫరా అవుతుందన్నారు. కాకినాడ నగరపాలక సంస్థకు నీటి సరఫరా చేసే ప్రధాన పైపునకు 4 చోట్ల ఇంటర్ కనెక్షన్స్ చేయాల్సివుందన్నారు. శశికాంత్ నగర్ ఫిల్టరేషన్ ప్లాంట్ నుంచి మంచినీటి సరఫరా జరుగు రిజర్వాయిర్లు శశికాంత్ నగర్, శ్రీవిద్య కాలనీ (డి-మార్ట్), భాస్కర్ నగర్, దుమ్ములపేట, సాంబమూర్తి నగర్, ఎఎంజి, శ్రీనివాస బ్యాంకు కాలనీ (గ్గిగోలపాడు) అనగా 1వ వార్డు నుంచి 13, 49, 50 వార్డుల పరిధిలోని ప్రజలకు ప్రత్యామ్నాయంగా ట్యాంకర్ల ద్వారా మంచినీటి సరఫరా చేయడం జరుగుతుందన్నారు. కావున ప్రజలు ముందస్తుగా మంచినీటిని నిల్వ చేసుకుని నగరపాలక సంస్థకు సహకరించాలని సూచించారు. మంచినీరు అత్యవసరమైతే నీటి సరఫరా ట్యాంకర్లు ద్వారా సరఫరా చేస్తామని, ఇందుకోసం 9848471415, 6301387834, 9676770461, 7382042977 నెంబర్లను సంప్రదించాలన్నారు. రోడ్డు మరమ్మతుల నేపథ్యంలో జరుగుతున్న అసౌకర్యాన్ని ప్రజలు అర్థం చేసుకోవాలని ఆమె కోరారు. 21వ తేదీ ఉదయం నుంచి మంచినీటి సరఫరాను యథావిధిగా ఇస్తామని చెప్పారు.


ఆసుపత్రిని ప్రారంభిస్తున్న సత్యప్రభ, నవీన్

అధునాతన వైద్యం అవసరం

ప్రజాశక్తి - ఏలేశ్వరం

మారుతున్న కాలంలో అధునాతన వైద్యం అందరికీ అందుబాటులోకి రావాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఎంఎల్‌ఎ వరుపుల సత్యప్రభ అన్నారు. ఆదివారం స్థానిక షిరిడి నగర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన ఉదయ్ కాంత్ చిల్డ్రన్ క్లినిక్‌ను టిడిపి జిల్లా అధ్యక్షులు జ్యోతుల నవీన్‌తో కలిసి ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రత్తిపాడు నియోజకవర్గంలోనే కాకుండా ఏజెన్సీ నుంచి వేలాది మంది గిరిజన, గిరిజనేతరులు వైద్యంతో పాటు అన్ని అవసరాలకు ఏలేశ్వరం పైనే ఆధారపడి ఉన్నారని అన్నారు. ఈ నేపథ్యంలోనే గత 5 సంవత్సరాల్లో శిధిలావస్థకు గురైన రమణయ్యపేట, జె.అన్నవరం గిరిజన ప్రాంత రోడ్డును రూ.22 కోట్లతో నిర్మిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి గొల్లపల్లి బుజ్జి, ఛైర్‌పర్సన్ అలమండ సత్యవతి, కౌన్సిలర్లు బొదిరెడ్డి గోపి, మూది నారాయణస్వామి, మాజీ జడ్‌పిటిసి జ్యోతుల పెదబాబు, చిన్న పిల్లల వైద్యులు డాక్టర్ ఉదయ్‌కాంత్, డాక్టర్ ఆదిలక్ష్మి, నాయుడు ఫిజియోథెరపీ అధినేత పిడిఎంఎల్.నాయుడు పాల్గొన్నారు.

ప్రకృతి వనరులపై ప్రజలకే హక్కు

-23న కాకినాడలో సదస్సును జయప్రదం చేయండి: సిపిఐ నేత ముప్పాళ్ల

ప్రజాశక్తి - కాకినాడ

మన చమురు, సహజ వాయువు ఖనిజాలు ప్రకృతి వనరులపై ఎపి ప్రజల హక్కుగా కాపాడుకోవాలని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక ఎస్‌టియు భవన్‌లో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అప్పట్లో కూరుకుపోయిన రాష్ట్రాన్ని ఆదుకోవాలంటే గ్యాస్ వాటా కోసం అంతా ఉద్యమించా లన్నారు. కాకినాడ సముద్ర తీరంలో ఏర్పడిన చమురు గ్యాస్ నిక్షేపాలు మన గ్యాస్ మన రాష్ట్రానికే దక్కాలని అప్పట్లో ఉన్న రాష్ట్రం అభివృద్ధి సాధించడానికి గ్యాస్ వాటా కోసం అన్ని రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలు ఏకమై పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. సహజవనరులు ఏ రాష్ట్రంలో ఉంటే ఆ రాష్ట్రానికి ఉత్పత్తిలో 50 శాతం కేటాయించాలని 12వ ఫైనాన్స్ కమిషన్ స్పష్టం చేసిందన్నారు. ఆంధ్ర ప్రాంతానికి న్యాయమైన గ్యాస్ కేటాయింపుల కోసం, న్యాయమైన ధర కోసం, న్యాయమైన 50 శాతం లాభం వాటా కోసం వామపక్షాలు, ప్రజాసంఘాలు, ప్రజాస్వామిక వాదులు, ప్రింట్ మీడియా, ఎలక్ట్రానిక్ మీడియా తీవ్రంగా కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర శాసనసభ, శాసనమండలిలో ఏకగ్రీవ తీర్మానాలు చేశాయని, అయినా గ్యాస్ కేటాయింపులు, ఆదాయంలో సగం పొందలేకపోయామన్నారు. సహజ వాయువు ఉత్పత్తి దేశమైన కువైట్ కన్నా మన దేశంలోనే బాంబే కన్నా మన గోదావరి బేసిన్లోనే ఎక్కువ నిల్వలు ఉన్నాయని పరిశోధనలు చెబుతున్నాయన్నారు. దీనిపై ప్రజలను చైతన్య పరిచేందుకు ఈ నెల 23న కాకినాడ కేంద్రంగా జరిగే సదస్సును ఉపాధ్యాయులు, విద్యార్థులు, కార్మికులు, రైతులు అన్ని వర్గాల ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డేగ ప్రభాకర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తాటిపాక మధు, జిల్లా కార్యదర్శి కె.బోడకొండ, డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కార్యదర్శి కె.సత్తిబాబు, ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి తోకల ప్రసాద్, ప్రముఖ విద్యావేత్తలు ఆలపాటి శ్రీనివాస్, కె.ఆదినారాయణ మూర్తి, చింతపల్లి సుబ్బారావు, పి సుబ్బరాజు, నక్క కిషోర్, జానీ మాస్టర్ పాల్గొన్నారు.


కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న సిపిఐ నేతలు

మండల పరిషత్ ఎదురుగా మురుగు కుంట

-పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక సామర్ల కోట రహదారిలోని మండల పరిషత్ కార్యాలయం ఎదురుగా మురుగునీటి గుంట ఏర్పడింది. దీంతో పందులకు ఆవాసంగా మారింది. వర్షపు నీరు, గృహాల నుంచి విడుదలయ్యే వృధా నీరు ప్రవహించేందుకు పక్కా డ్రెయిన్ లేకపోవడంతో మురుగునీరు అక్కడే నిలిచిపోతుంది. దీనికి తోడు సామర్లకోట - పెద్దాపురం రహదారి నుంచి మండల పరిషత్ కార్యాలయంలోకి వెళ్లేందుకు రహదారి కోసం డ్రెయిన్‌పై తూరలు వేశారు. ఈ తూరలు మట్టితో పూడ్చుకుపోవడంతో మురుగు నీరు ప్రవహించే పరిస్థితి లేదు. దీనివల్ల దోమలు, ఈగలు పెరిగిపోయి దుర్గంధం వెదజల్లుతోంది. వీటికితోడు పందులకు ఆవాసంగా మారింది. తక్షణమే మున్సిపల్ అధికారులు స్పందించి మురుగు నీటి ప్రవాహానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.


నిల్చిపోయిన మురుగునీరు

ధరల స్థిరీకరణకు చర్యలు

ప్రజాశక్తి - కాకినాడ

గంటకో రకంగా పెరుగుతున్న ధరలను స్థిరీకరించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని పౌర సంక్షేమ సంఘం కన్వీనర్ దూసర్లపూడి రమణరాజు ఆదివారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. ప్రతి నిత్యావసర వస్తువు ధర గంటకో రకంగా, రోజుకో ధర పెరుగుతుందన్నారు. దీనివల్ల సగటు వినియోగదారులు ఆర్థికంగా ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని అన్నారు. అంతర్జాతీయ స్థాయిలో రూపాయి మారకం విలువ తగ్గిపోవడంతో ద్రవ్యోల్బణం ఏర్పడి ధరలు మరింతగా పెరుగుతున్నాయన్నారు. చమురు, పెట్రోల్, డీజిల్, వంట గ్యాస్‌లపై జిఎస్‌టి తగ్గించకపోవడంతో విద్యుత్ భారాలు, రోడ్డు రవాణా, రైల్వే ట్రాన్స్‌పోర్ట్ ఛార్జీలు పెరుగుతున్నాయని అన్నారు. ఫలితంగా నిత్యావసరాల ధరలు ప్రతి నెల పెరుగుతూనే ఉన్నాయన్నారు. తక్షణమే ప్రభుత్వం ధరల స్థిరీకరణ చేపట్టాలని ప్రతి మార్కెట్‌లో ప్రభుత్వ ధరలకు అమ్మకాలు చేసే కేంద్రాలు ఏర్పాటు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ తీర్పుపై హర్షం

ప్రజాశక్తి - తాళ్లరేవు

మండలంలోని పోలేకుర్రు పంచాయతీ తోటపేటకు చెందిన అంగన్‌వాడీ వర్కర్ పెట్టిన అట్రాసిటీ కేసులో వచ్చిన తీర్పు పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు. ఆదివారం స్థానికంగా నిర్వహించిన విలేకరుల సమావేశంలో న్యాయవాది అయినాపురపు సూర్యనారాయణ, రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా (అంబేద్కర్) రాష్ట్ర అధ్యక్షులు పిట్టా వరప్రసాద్, కెవిపిఎస్ మండల కన్వీనర్ విప్పర్తి శ్రీనివాస్, బాధిత అంగన్‌వాడీ వర్కర్ సాధనాల మంగాదేవి మాట్లాడారు. పోలేకుర్రు పంచాయతీ తోటపేట అంగన్‌వాడీ కేంద్రం హెల్పర్‌గా విధులు నిర్వహిస్తున్న సాధనాల మంగాదేవికి 2018లో ఉద్యోగన్నతి ఇచ్చి అదే పంచాయతీ పోలేకుర్రులోని అంగన్‌వాడీ కేంద్రం-2కి వర్కర్‌గా అధికారులు నియమించారు. విధులు నిర్వహించడానికి వెళ్లిన సమయంలో ఆమెను దళిత కులానికి చెందిన అంగన్‌వాడీ వర్కర్ విధులు నిర్వహించడానికి వీలులేదని కొందరు అడ్డుతగిలారు. దీంతో ఆమె 2018 జూన్ 28న కోరంగి పోలీస్ స్టేషన్లో ఆమె ఫిర్యాదు చేశారు. ఆ కేసుపై నలుగురిపై ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసును పోలీసులు నమోదు చేశారు. దాదాపు ఆరేళ్లపాటు కేసు విచారణ జరిగింది. 16 మంది సాక్షులను విచారించారు. ఈ నెల 11వ తేదీన ఈ కేసుకు సంబంధించి నలుగురికి శిక్ష విధిస్తూ రాజమహేంద్రవరం స్పెషల్ జడ్జి తీర్పు ఇచ్చారు. ఈ కేసులో అప్పటి సర్పంచ్ మొండి హరిచిన్నారావు మృతి చెందగా, సమనాస సుబ్బారావు, సమనాస తమ్మయ్య, సమనాస సుబ్బలక్ష్మికి 7 నెలలు జైలు శిక్ష, రూ.1500 జరిమానా విధిస్తూ కోర్టు తీర్పు ఇచ్చింది. అలస్యంగానైనా దళిత మహిళకు అనుకూలంగా తీర్పు రావడం పట్ల వారు హర్షం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో గ్రామ పెద్దలు, బాధితురాలి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న న్యాయవాది సూర్యనారయణ


మరిడమ్మ ఆలయం వద్ద అన్నదానం

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక మరిడమ్మ ఆలయంలో ఆలయ అసిస్టెంట్ కమిషనర్ కె.విజయలక్ష్మి ఆధ్వర్యంలో ఆదివారం అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లా డుతూ ప్రతి ఆదివారం సుదూర ప్రాంతాల నుంచి మరిడమ్మ అమ్మవారిని దర్శించుకునేందుకు వచ్చే యాత్రికుల కోసం దాతల సాయంతో అన్నదానం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆలయ అసాదులు విజయకుమార్, నాని, వేద పండితులు వెంకటశాస్త్రి, ప్రసాద్ శాస్త్రి, శంకర్ శర్మ, సిబ్బంది పాల్గొన్నారు.


అన్నదాన కార్యక్రమంలో ఎసి విజయలక్ష్మి

కార్టూ'నిజం'



మాదకద్రవ్యాలు, సైబర్ నేరాలపై అవగాహన

ప్రజాశక్తి - కాకినాడ

నగరంలోని ఆదిత్య డిగ్రీ, పీజీ కళాశాలలో ఆదివారం మాదకద్రవ్యాలు, సైబర్ నేరాలపై అవగాహనా సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ వి.కిషోర్ మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత లక్ష్యాలు కలిగి ఉండాలని, ఈ వయసులో మిత్రుల ఎంపిక చాలా విలువైనదని అన్నారు. చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని సూచించారు. డిజిటల్ అరెస్ట్ అనే మాట ఫేక్ అని, అజాగ్రత్తగా ఉండకూడదని అన్నారు. సోషల్ మీడియాలో జరుగుతున్న మోసాలను ఉదాహరణలతో వివరించారు. క్యాంపస్ ఇన్‌ఛార్జ్ ఎన్.మూర్తి మాట్లాడుతూ విద్యార్థులు సైబర్ సెక్యూరిటీ పట్ల అప్రమత్తంగా ఉంటూ, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు. కళాశాలలో డిఎఫ్ ఎపి, ఎన్ఎస్ఎస్ ద్వారా అవగాహన కార్యక్రమాలు తరచుగా నిర్వహిస్తున్నామని అన్నారు. అనంతరం 'డ్రగ్స్ వద్దు బ్రో' అంటూ నృత్య రూపకాన్ని ప్రదర్శించిన విద్యార్థులను ఎస్ఐ.కిషోర్ అభినందించారు. ఈ కార్యక్రమాన్ని నిర్వహించిన ఎన్ఎస్ఎస్ బృందాన్ని ఆదిత్య విద్యాసంస్థల ఛైర్మన్ డాక్టర్ నల్లమిల్లి శేషారెడ్డి, డిగ్రీ కళాశాలల సెక్రెటరీ డాక్టర్ నల్లమిల్లి సుగుణారెడ్డి, డైరెక్టర్ డాక్టర్ నాయుడు అభినందించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ సత్యనారాయణ, ఎన్ఎస్ఎస్ పిఒ టి.తేజేశ్వరరావు, ఐ.గౌరీప్రియ విద్యార్థులు పాల్గొన్నారు.



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఎస్ఐ కిషోర్

మహాప్రస్థానం వాహనం ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి - రౌతులపూడి

స్థానిక ఏరియా ఆసుపత్రి పరిధిలో మహాప్రస్థానం వాహనాన్ని ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు. అత్యవసర వైద్య సేవ నిమిత్తం మండలంలోని వివిధ గ్రామాల నుంచి అర్ధరాత్రి సమయాల్లో క్షతగాత్రులను సిహెచ్‌సికి తీసుకొస్తున్నారు అయితే మార్గమధ్యలోనూ, ఆసుపత్రిలో వైద్య సేవలు పొందుతూ పరిస్థితి విషమించ చనిపోయిన ఘటనలు కోకొల్లలు. ఈ సమయంలో మృతదేహాలను ఇళ్లకు తీసుకెళ్లేందుకు బంధువులు, కుటుంబ సభ్యులు నానా ఇబ్బందులకు గురవుతున్నారు. మృతదేహాలను తీసుకెళ్లేందుకు ప్రయివేటు వాహనదారులు ముందుకు రాకపోవడం, ఆసుపత్రిల్లో కూడా వాహనం లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ఏరియా ఆసుపత్రుల్లో మాదిరిగా సిహెచ్‌సిల్లోనూ మహాప్రస్థానం వాహనాన్ని ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. ఇది ఇలా ఉండగా ఆస్పత్రిలో ఒక వాహనం నిరుపయోగంగా ఉంది. దీన్ని అత్యవసర పరిస్థితుల్లో వైద్య సేవలు అందించడానికి ఉపయోగించాల్సి ఉంది. డ్రైవర్ లేరనే సాకుతో ఆసుపత్రి సొంత అవసరాలకు మాత్రమే ఉపయోగిస్తున్నారు. దీన్ని అందుబాటులోకి తేవాలని, మహాప్రస్థానం వాహనాన్ని కేటాయించాలని స్థానికులు కోరుతున్నారు.



డ్రైవర్ లేక మూలన పడ్డా అంబులెన్స్

కాకినాడలో ఎల్ఎన్‌జి ఇంపోర్ట్ టెర్మినల్

ప్రజాశక్తి - కాకినాడ

కాకినాడ పోర్ట్‌లో భారీ పెట్టుబడితో లిక్విఫైడ్ నేచురల్ గ్యాస్(ఎల్ఎన్‌జి)టెర్మినల్‌ను నెలకొల్పేందుకు నార్వే సంస్థ ముందుకు వచ్చింది. నార్వేకు చెందిన క్రౌన్ ఎల్ఎన్‌జి సంస్థ రూ.9 వేల కోట్ల భారీ పెట్టుబడి పెట్టేందుకు ఆదివారం ఎంపి తంగెళ్ల ఉదయ్‌శ్రీనివాస్ సమక్షంలో క్రౌన్ ఎల్ఎన్‌జి సిఇఒ స్వపన్ కటారియా, ఇండియన్ గ్యాస్ ఎక్స్ఛేంజ్ ఎండి రాజేష్‌కుమార్ ఒప్పందంపై సంతకాలు చేశారు. ఈ సందర్భంగా ఎంపి మాట్లాడుతూ వికసిత్ భారత్- 2047లో భాగంగా ఎన్‌డిఎ ప్రభుత్వం ఎనర్జీ సెక్టార్‌పై ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. ఎపి ప్రభుత్వం ఎనర్జీ సెక్టార్‌పై ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. క్రౌన్ ఎల్ఎన్‌జి భారీ పెట్టుబడితో ఇంపోర్ట్ గ్యాస్ టెర్మినల్‌ను ఏర్పాటు చేస్తుందన్నారు. కాకినాడ పోర్ట్‌లో ఏర్పాటు చేస్తున్న ఈ టెర్మినల్ ప్రపంచంలోనే రెండవది కాగా, ఆసియాలో మొట్టమొదటి ప్రాజెక్ట్ అవుతుందన్నారు. కాకినాడ పోర్టు నుంచి సుమారు 15 కి మీ దూరంలో సముద్ర తీరాన ఏర్పాటు కానున్న ఈ టెర్మినల్ పైప్‌లైన్ల ద్వారా ఏడాదికి 7.2 మిలియన్ మెట్రిక్ టన్నుల గ్యాస్ ఉత్పత్తి కానుందని, దీంతో పెద్దఎత్తున యువతకు ఉపాధి అవకాశాలు ఉంటాయన్నారు.


ఒప్పంద పత్రాలు మార్చుకుంటున్న సిఇఒలు

నేరాలు ఘోరాలు

పేకాట శిబిరాలపై పోలీసుల దాడి

ప్రజాశక్తి - పెద్దాపురం

మండల పరిధిలోని చిన్న బ్రహ్మదేవం, చదలాడ గ్రామాల్లో ఎస్ఐ వి.మౌనిక ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం నిర్వహించిన దాడుల్లో పేకాడుతున్న 11 మందిని అరెస్టు చేశారు. వారి నుంచి రూ.10,050 నగదును స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

సామర్లకోటలో...

మండలం వేట్లపాలెం గ్రామంలో పేకాట శిబిరంపై సిఐ కృష్ణభగవాన్ ఆధ్వర్యంలో సిబ్బంది ఆదివారం తెల్లవారుజామున దాడి చేశారు. ఈ దాడిలో 14మందిని అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ.1,21,050 నగదును స్వాధీనం చేసుకున్నారు. వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

10 లీటర్ల సారాతో మహిళ అరెస్ట్

ప్రజాశక్తి - పెద్దాపురం

మండలంలోని ఆర్‌బి.కొత్తూరు గ్రామంలో ఆదివారం సాయంత్రం ఎస్ఐ వి.మౌనిక ఆధ్వర్యంలో పోలీసులు నిర్వహించిన దాడిలో 10 లీటర్ల సారాతో మహిళను అరెస్టు చేశారు. ఆమెపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

గంజాయితో ముగ్గురు అరెస్ట్

ప్రజాశక్తి - గండేపల్లి

మండలంలోని నీలాద్రిరావుపేట నుంచి జెడ్ రాగంపేట వెళ్లే దారిలో గంజాయిని తరలిస్తున్న ముగ్గురిని పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి మోటార్ సైకిల్‌తోపాటు, 3 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను సిఐ వైఆర్‌కె.శ్రీనివాస్ ఆదివారం మీడియా సమావేశంలో వెల్లడించారు. ఏజెన్సీకి చెందిన రాజవొమ్మంగి, జి.మాడుగుల ప్రాంతం నుంచి గంజాయిని తక్కువ మోతాదులో తెచ్చి, గండేపల్లి, సామర్లకోట, కాకినాడ, కిర్లంపూడిలో యువతకు చిల్లరగా అమ్ముతున్న ముద్దాయిలపై నిఘా పెట్టినట్లు తెలిపారు. ఈ నేపథ్యంలోనే పోలీసులకు వచ్చిన ముందస్తు సమాచారంతో శనివారం రాజవొమ్మంగికి చెందిన కెకె.సాగర్, మాడుగులకు చెందిన కెపి.కుమార్, సామర్లకోటకి చెందిన పికె.కృష్ణలను గంజాయి తరలిస్తుండగా అరెస్టు చేసినట్లు తెలిపారు. ఈ కేసులో కిర్లంపూడికి చెందిన మరొక ముద్దాయి పరారీలో ఉన్నట్లు తెలిపారు. వీరిని కోర్టులో హాజరుపర్చినట్లు తెలిపారు. గంజాయితోపాటు, స్వాధీనం చేసుకున్న మొత్తం రూ.61,500 ఉంటుందని తెలిపారు. ఈ సమావేశంలో ఎస్ఐ శివనాగు, సిబ్బంది పాల్గొన్నారు.

గ్రావెల్ ట్రాక్టర్ స్వాధీనం ఇద్దరిపై కేసు నమోదు

ప్రజాశక్తి - గొల్లప్రోలు

మండలంలోని చేందుర్తి గ్రామంలో పోలవరం, పుష్కర కాలువల నుంచి అక్రమంగా మట్టిని తరలిస్తున్న గ్రావెల్ ట్రాక్టర్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. శనివారం అర్ధరాత్రి రెండు గంటలకు అక్రమంగా గ్రావెల్ తరలిస్తున్నట్లు వచ్చిన సమాచారంతో పోలీసులు, రెవెన్యూ అధికారులు దాడి చేశారు. పోలవరం, పుష్కర కాలవ గట్టు నుంచి అక్రమంగా తరలిస్తున్న గ్రావెల్ ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకుని, డ్రైవర్‌ని అదుపులో తీసుకున్నారు .గ్రావెల్ పోస్తున్న జెసిబి డ్రైవర్ పరారయ్యాడు. ట్రాక్టర్ డ్రైవర్ కొరిమిల్లి సురేష్, వజ్రకోటంకు చెందిన జెసిబి డ్రైవర్ వాసా రాజుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఎన్.రామకృష్ణ తెలిపారు.

రైలు నుంచి జారిపడి యువకుని మృతి

ప్రజాశక్తి - సామర్లకోట

సామర్లకోట రైల్వే స్టేషన్‌లో రైలెక్కుతూ జారిపడి యు.కొత్తపల్లి మండలం ఉప్పాడ నాయకర్ కాలనీకి చెందిన వాకాడ జాన్‌బాబు (27) దుర్మరణం చెందారు. సామర్లకోట రైల్వే స్టేషన్లో నూజివీడు వెళ్లేందుకు తన తండ్రి, భార్య, కుమారుడితో కలిసి జాన్‌బాబు రైలు ఎక్కుతుండగా శనివారం ప్రమాదవశాత్తు జారి పడిపోయాడు. దీంతో అతడు అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

రోడ్డు ప్రమాదంలో బాలుని మృతి

ప్రజాశక్తి - శంఖవరం

అన్నవరంలోని జాతీయ రహదారిపై ఆటోను బైక్ ఢీకొన్న ప్రమాదంలో ఒక బాలుడు మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. ఆదివారం రాత్రి సుమారు 8 గంటల సమయంలో అన్నవరం నుంచి తుని వెళుతున్న ఆటో మండపం సెంటర్ వద్ద యూటర్న్ తీసుకుంటుండగా బైక్‌పై వస్తున్న యువకులు ఆటోను ఢీకొట్టారు. అన్నవరానికి చెందిన సుశాంత్ (16) అనే బాలుడు అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిపారు. ఎస్ఐ హరిబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉత్తీర్ణతా శాతం పెంపే లక్ష్యం

ఆర్ఐఒ జిఎస్ఎల్‌వి నర్సింహులు



ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

ప్రభుత్వ జూనియర్ కాలేజీలలో ఉత్తీర్ణతా శాతం పెంపు లక్ష్యంగా ప్రభుత్వ ఆదేశాలతో ఇంటర్మీడియెట్ విద్యా మండలి సంకల్ప్-2025 రూపొందించిందని ఆర్ఐఒ నర్సింహులు తెలిపారు. దానికనుగుణంగా కార్యక్రమాలు నిర్వహించామని తెలిపారు. ఇప్పటికే ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు పూర్తయ్యాయన్నారు. ప్రభుత్వ, వివిధ సంక్షేమ, ఎయిడెడ్ యాజామాన్యల పరిధిలో విద్యనభ్యస్తున్న విద్యార్థులు పరీక్షలకు సిద్ధం అవుతున్నారు. ఇంటర్మీడియెట్ విద్యామండలి ప్రకటించిన సంకల్ప్-2025 మంచి ఫలితాలను ఇస్తుందన్నారు.

జిల్లాలో కళాశాలలు ఎన్ని, ఎంత మంది విద్యార్థులు ఉన్నారు.

జిల్లాలో ప్రభుత్వ, ప్రభుత్వేర కాలేజీలు మొత్తం 125 ఉన్నాయి. వీటిలో ప్రభుత్వ జూనియర్ కాలేజీలు 16, ఎయిడెడ్ 2, సోషల్ వెల్ఫేర్ కాలేజీలు 6తో పాటు హైస్కూల్ ప్లస్ మరో 23 కాలేజీలు కలిపి మొత్తం 47 కాగా మిగిలినవి 78 కాలేజీలు ప్రైవేట్, కార్పొరేట్ కాలేజీలు ప్రైవేట్ కార్పొరేట్ సంస్థలు నిర్వహిస్తున్నాయి. జిల్లాలో ఇంటర్మీడియెట్ విద్యార్థులు 23,530 మంది విద్యనభ్యసిస్తుండగా, ద్వితీయ సంవత్సరం 20,880 మంది విద్యనభ్యసిస్తున్నారు.

ప్రభుత్వ, ఎయిడెడ్, యాజమాన్యాల పరిధిలో ఎంత మంది

ప్రభుత్వ, ఎయిడెడ్, ఇతర సంక్షేమ విభాగాల నిర్వహణలోని కాలేజీలలో మొత్తం 8,444 మంది విద్యార్థులు ఇంటర్మీడియెట్ విద్యను అభ్యసిస్తున్నారు. వీరిలో ప్రథమ సంవత్సరం ఇంటర్మీడియెట్ విద్యార్థులు 4,733 మంది, ద్వితీయ సంవత్సరం ఇంటర్మీడియెట్ విద్యార్థులు కేవలం 3,711 మంది ఉన్నారు. 2024 మార్చి పరీక్షల ఫలితాల్లో మొదటి సంవత్సరం ఇంటర్మీడియెట్ విద్యార్థులు 75 శాతం మంది పాస్ పర్సంటేజీ నమోదు కాగా, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 85 శాతం సాధించారు. రాష్ట్ర స్థాయిలో జిల్లాకు 5వ స్థానం లభించింది. ఈ విద్యా సంవత్సరం 100 శాతం ఉత్తీర్ణత లక్ష్యంగా సంకల్ప్ అమలు చేస్తున్నాం.



ఇంటర్మీడియెట్ విద్యార్థుల సిలబస్ పూర్తి చేశారా

ఇంటర్మీడియెట్ విద్యార్థుల సిలబస్ సకాలంలోనే పూర్తి చేశామన్నారు. ఈ విద్యా సంవత్సరం విద్యార్థులందరికీ పాఠ్యపుస్తకాలు అందజేశాము. ప్రతి రోజూ మధ్యాహ్నం 3 గంటల నుంచి 5 గంటల వరకూ స్టడీ అవర్స్ నిర్వహిస్తున్నాము. ప్రతి లెక్చరర్‌కు విద్యార్థులను కేటాయించడంతో ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నాము. ఉత్తమ ఫలితాలు వస్తాయని ఆశిస్తున్నాము.

సంకల్ప్-2025 ఎలా అమలు చేశారు.

తాజా విధానం ప్రకారం కేర్ టేకర్ విధానం అమల్లోకి తెచ్చారు. విద్యార్థులను ఎ, బి, సి కేటగిరీలుగా విభజించారు. బి, సి కేటగిరీ విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. ప్రభుత్వ జూనియర్ కాలేజీలు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు తరగతులు నిర్వహించాం. ఈ విధానంతో తరగతుల పని వేళలు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటలకు పరిమితం చేశారు. మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకూ స్టడీ అవర్స్‌గా నిర్వహిస్తున్నాం. ప్రతి లెక్చరర్‌కు కాలేజీలలో విద్యార్థుల సంఖ్య ఆధారంగా కేటాయింపులు చేశాము.

యానాం వార్తలు



ఎంపి వైద్యలింగంకు నివేదికను అందిస్తున్న ఫోరమ్ ప్రతినిధులు

ఎంపి వైద్యలింగంకు అడ్మినిస్ట్రేటివ్ స్టాఫ్ నివేదిక

ప్రజశక్తి - యానాం

యానాంలో నెలకున్న సమస్యలు, పారిశ్రామికంగా ఉన్న అనుకూల, ప్రతికూల అంశాలపై రూపొందించిన నివేదికను ఎంపి వైద్యలింగం, మాజీ సిఎం వి.నారాయణస్వామిలకు అందజేశారు. అడ్మినిస్ట్రేటివ్ స్టాఫ్ కాలేజ్ సంబంధిత నివేదికను రూపొందించింది. ఈ నివేదికను యానాం సిటిజన్ ఫోరమ్ పక్షాన ప్రముఖ పారిశ్రామికవేత్త ఈలప్రోలు విష్ణువర్ధనరావు, అన్యం రామకృష్ణారావు, నామాడి అప్పారావు, దాట్ల దేవదానంరాజు అందజేశారు. అలాగే యానాంకు చెందిన ప్రముఖకవి, కథారచయిత దాట్ల దేవదానంరాజు వృద్ధాప్యంపై రచించిన 'నాలుగో పాదం' కవితా సంపుటిని తమిళంలో అనువాదం చేసి రచయిత వారికి అందజేశారు.

అంధత్వ నివారణకు కృషి చేయాలి

ప్రజాశక్తి - సామర్లకోట



కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

సమాజంలో అంధత్వ నివారణ కోసం స్వచ్ఛంద సేవా సంస్థలు కృషి చేయాలని తెలుగు రైతు జిల్లా అధ్యక్షులు పాలకుర్తి శ్రీనివాసాచార్యులచౌదరి పిలుపునిచ్చారు. ఆదివారం మండలంలో జి.మేడపాడు గ్రామంలో తూర్పు కాపు విద్యా విజ్ఞాన సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కిరణ్ కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో మెగా ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కిరణ్ కంటి ఆసుపత్రి కంటి వైద్యులు డాక్టర్ అనూష వైద్య పరీక్షలు నిర్వహించి 40 మందికి శస్త్రచికిత్స అవసరమని గుర్తించారు. ఈ వైద్య శిబిరంలో కిరణ్ కంటి ఆసుపత్రి ప్రోగ్రాం మేనేజర్ సత్యనారాయణ, తూర్పు కాపు విద్యావిజ్ఞాన సంక్షేమ సంఘ అధ్యక్షులు నూకిరెడ్డి శ్రీనివాసు, వైస్ ప్రెసిడెంట్ పిల్లా సత్యనారాయణ, సెక్రెటరీ పైలా సత్యనారాయణ, జాయింట్ సెక్రెటరీ డేగల వీరబాబు, ట్రెజరర్ జామి యేసుకృష్ణ తదితరులు సేవలు అందించారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు జానా వెంకట్రావు, సంఘసభ్యులు జామి శ్రీనివాస్, పిల్లా అప్పలరాజు, కర్రి రామకృష్ణ, పైలా వెంకటేశ్వరరావు, ఉగ్గిన సూర్య భాస్కరరావు, పటాని వేణుగోపాల మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రయివేటు పాఠశాలల సమస్యల పరిష్కారానికి కృషి

ప్రజాశక్తి - ముమ్మిడివరం

ప్రయివేటు పాఠశాలల సమస్యలను సిఎం , విద్యాశాఖ మంత్రి దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించే దిశగా కృషి చేస్తానని ప్రభుత్వ విప్, ఎంఎల్ఎ దాట్ల సుబ్బరాజు అన్నారు. నగర పంచాయతీ పరిధిలోని స్థానిక ఆపిల్ స్కూల్ నందు గోదశి పుండరీష్ అధ్యక్షతన ఆదివారం జిల్లా ప్రయివేటు స్కూల్ కరస్పాండెంట్ల సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ప్రయివేటు పాఠశాలల కరస్పాండెంట్లు రాష్ట్రలీగల్ అడ్వైజర్ ముతుకుమిల్లి శ్రీ విజయ్ మాట్లాడుతూ ప్రభుత్వ అవలంబిస్తున్న విధానాలతో ప్రయివేటు పాఠశాలలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని అన్నారు. ఎక్కడా లేని విధంగా సమాచార హక్కు చట్టంలో లేని అంశాలను అధికారులు ప్రయివేటు పాఠశాలలపై రుద్దటం దారుణం అన్నారు. ముఖ్యం గా విద్యా హక్కు చట్టం 2010 రూల్ నెంబర్ 14లో ఉన్న లోసుగులపై ఇప్పటికే కోర్టు స్టే తీసుకు రాటం జరిగిందన్నారు. దీనిపై పాఠశాల కరస్పా ఒడెంట్ల, ఎవరూ ఆందోళన చెందవలసిన అవసరం లేదన్నారు. విశిష్ట అతిథిగా ప్రభుత్వ విప్, ఎంఎల్ఎ దాట్ల సుబ్బరాజు విచ్చేశారు. ఈ కార్యక్రమంలో తులిప్స్ రమేష్, ముమ్మిడి ప్రసాద్, మంగళం పల్లి అంజిబాబు, పొత్తూరి లక్ష్మీ శ్రీనివాసన్(రవీంద్ర స్కూ ల్, ముమ్మిడివరం), సత్యనారాయణ (సిద్ధార్థ, సిరి పల్లి), శ్రీనివాస్, నాగులు తదితరులు పాల్గొన్నారు.

కోడు కాలువలో చెత్త డంపింగ్

ప్రజాశక్తి - ఆలమూరు

వర్షపు నీరు, సాగులో అధిక నీరు కోడు కాలువ ద్వారా బయటకు పోయి పంటలకు రక్షణగా ఉండేదని, కానీ కోడు కాలువను చెత్త డంపింగ్‌గా మార్చడంతో పంట పొలాల్లో నీరు నిలిచిపోయి పంట చేతికి వచ్చే సమయంలో చేజారి పోతుందని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండల కేంద్రం శివారున, పెనికేరు, కలవచర్ల గ్రామాల మధ్య రైతులకు సాగునీరు అందించే కోడు (నీటి కాలువ)ఉందన్నారు. ప్రతి ఏడాది వర్షాకాలంలో ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షపు నీరు, చొప్పెల్ల జాతీయ రహదారి చెంతన ఉన్న కాలువ ద్వారా ప్రవహిస్తూ వచ్చే సాగునీరు ఈ కోడులో కలసి తద్వారా కలవచర్లకు చెందిన పంట బోదెలోకి చేరుకుంటుందన్నారు. ఈ కోడు ప్రాంతంలో పలు గ్రామాల నుంచి చెత్తను తరలించి డంపింగ్ యార్డ్ మాదిరిగా ఏర్పాటు చేశారన్నారు. కొన్నేళ్లగా పూర్తిస్థాయిలో పూడికలు తీయకపోవడం, రహదారుల నిర్మాణం, కాలువలను ఆక్రమించుకోవడం, తూరలు మూసుకుపోవడంతో వర్షాకాలంలో నీరు దిగువకు చేరడంలో ఇబ్బందులు తలెత్తుతున్నా యన్నారు. చిన్నపాటి వర్షానికే పంట పొలాల్లో మోకాలు లోతులో నీరు నిలిచిపోతుందని, దీంతో పంట కుళ్లిపోయి రైతుల నష్టాలను చవిచూడాల్సి వస్తుందన్నారు. చొప్పెల్ల, మూలస్థానం, జొన్నాడ, నర్సిపూడి, నవాబుపేట, పెనికేరు, కవచర్ల, ఆలమూరు గ్రామాలలో కొన్ని వందల ఎకరాల్లో పంటపొలాలు నీట మునిగిపోతు న్నాయని అన్నారు. ఇకనైనా మా సమస్యను పట్టించుకుని సంబంధిత అధికారులు, నాయకులు స్పందించి ముందుకు వచ్చి ఆ కోడు సమీపంలో ఆక్రమణలు తొలగించి మూసివేసిన పంటబోదెను తిరిగి పూడిక తీయించాలని రైతులు డిమాండ్ చేశారు. పంట పొలాల్లో నిలిచిన వర్షపునీరు బయటకు పోయే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను రైతులు కోరుతున్నారు.

విలసవిల్లిలో మసీదు ప్రారంభం

ప్రజాశక్తి - ఉప్పలగుప్తం

విలసవిల్లి ముస్లిం వీధిలో సుమారు రూ.30 లక్షల వ్యయంతో ముస్లింలు మసీదును నిర్మించుకున్నారు. మసీదును ఆదివారం ప్రారంభించుకుని ప్రార్థనలు చేశారు.మసీదును స్థానిక సర్పంచ్ సలాది ఊర్మిళదేవి, వైసిపి గ్రామ కమిటీ అధ్యక్షుడు సలాది సతీష్, మసీదు చైర్మన్ షేక్ జిలానీ ముస్లిం పెద్దలు సందర్శించారు.



దుస్తులు పంపిణీ చేస్తున్న స్వర్ణాంధ్ర ప్రతినిధులు

స్వర్ణాంధ్ర ఆధ్వార్యాన దుస్తుల పంపిణీ

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

అవసరార్థులకు స్వర్ణాంధ్ర సేవా సంస్థ ఆధ్వర్యంలో రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రి, పుష్కరాల రేవు వద్ద దుస్తుల పంపిణీ చేసినట్లు స్వర్ణాంధ్ర సేవా సంస్థ నిర్వాహకులు లయన్ డాక్టర్ గుబ్బల రాంబాబు తెలిపారు. హుదూద్, తిత్లి తుపాన్ వంటి వివిధ విపత్తులు సంభవించినప్పుడు, అగ్ని ప్రమాద బాధితులకు, నిరాశ్రయులకు దుస్తుల పంపిణీ చేస్తున్నామన్నారు. ఇప్పటివరకు ఐదు లక్షల జతల దుస్తులు పంపిణీ చేసినట్లు రాంబాబు తెలిపారు. ఆనందాల గోడ(వాల్ ఆఫ్ హ్యాపీనెస్)అనే కార్యక్రమం ద్వారా 2016 నుంచి రాజమహేంద్రవరం, విశాఖ, తూర్పుగోదావరి, మన్యం ప్రాంతాలతో కలిపి పలుచోట్ల అవసరార్థులను గుర్తించి దుస్తులు పంపిణీ చేస్తున్నామన్నారు. దుస్తులు సమకూర్చి ఇస్తున్న దాతలకు రాంబాబు ధన్యవాదాలు తెలిపారు. 2016లో అప్పటి రాజమండ్రి మున్సిపల్ కమిషనర్ విజయరామరాజు, సబ్ కలెక్టర్ విజయ కృష్ణన్ చేతుల మీదుగా ఈ సరికొత్త కార్యక్రమం ప్రారంభించబడిందని అన్నారు. అదనంగా ఉన్న దుస్తులను శుభ్రపరిచి, ఇస్త్రీ చేసి లాలాచెరువులోని స్వర్ణాంధ్ర వృద్ధాశ్రమానికి అందిస్తే అవి తిరిగి అవసరార్థులకు పంపిణీ చేస్తామని రాంబాబు దాతలను కోరారు.

గ్రామాల అభివృద్ధికి ప్రాధాన్యత

ప్రజాశక్తి - సామర్లకోట



జరుగుతున్న పనులపై సమీక్షిస్తున్న చినరాజప్ప

గ్రామాల అభివృద్ధికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలని ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప కోరారు. ఆదివారం మండలంలోని అచ్చంపేటలోని ఆయన కార్యాలయంలో హుస్సే న్పురం గ్రామంలో నిర్వహిస్తున్న అభివృద్ధి పనులను సమీక్షించారు. ప్రాధాన్యత క్రమంలో పనులు సక్రమంగా నిర్వహించాలని ఆయన ఆదేశించారు. ఈ కార్యక్రమంలో గ్రామ టిడిపి నాయకులు చల్లా బుజ్జి, కోట అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

పలువురికి ఉచిత వైద్య పరీక్షలు

ప్రజాశక్తి - మామిడికుదురు



వెరి కోస్ వైద్య పరీక్షలు అందిస్తున్న డాక్టర్

మొగలికుదురు శ్రీ సత్య సాయి కళ్యాణ మండపం లో సత్యసాయి సేవా సంస్థల ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వెరికోస్ వైద్య శిబిరం నిర్వహించి పలువురికి వైద్య పరీక్షలు నిర్వహించారు. డాక్టర్లు స్వామి, జివి.ప్రవీణ్ కుమార్ వైద్య పరీక్షలు చేసి ఆపరేషన్ అవసరమైన వారిని గుర్తించారు. వారికి హైదరాబాదులో ఉచితంగా ఆపరేషన్లు చేస్తారని సంస్థ జిల్లా అధ్యక్షులు అడబాల కొండబాబు తెలిపారు కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు ఎంపి వర్ధనరావు, ఎ.కృష్ణ, డాక్టర్ కాశినప్రభాకర్, వాసవిబుజ్జి తదితరులు పాల్గొన్నారు

ప్రభుత్వ పాఠశాలల్లో బాలల కథల పోటీలు

ప్రజాశక్తి - కాట్రేనికోన

కొల్లు రమణ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బాలల కథల పోటీలు నిర్వహించనున్నట్లు ఫౌండేషన్ అధ్యక్షులు కొల్లు ఆనంద్, యువ కవి ఎలిపే మధులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కథల పోటీలకు మండల పరిధిలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలో 8, 9 తగరతులు చదివే విద్యార్థినీ, విద్యార్థులు అర్హులు అన్నారు. విద్యార్థులు రాసిన కథలలో ఎంపిక చేయబడిన 20 కథలకు బహుమతులతో పాటు ప్రశంసా పత్రాలు అందిస్తామని అన్నారు. ఆసక్తి గల విద్యార్థిని, విద్యార్థులు తమ పేరులను ఈ నెల 20వ తేదీ లోపు నమోదు చేసుకోవాలన్నారు. వివరాలకు సెల్ నెంబర్ 8466945077లో సంప్రదించాలని ఆనంద్, మధులు కోరారు.

కూటమి వైఫల్యాలపై ప్రజలను చైతన్యం చేయాలి

ప్రజాశక్తి - అంబాజీపేట



బొత్సను శాలువాతో సత్కరిస్తున్న పి.గన్నవరం కో-ఆర్డినేటర్ శ్రీనివాసరావు

కూటమి ప్రభుత్వం ప్రజా వ్యతిరేక వైఫల్యాలపై ప్రజలను చైతన్యం చేయాలని ఉభయ గోదావరి జిల్లాల రీజనల్ కో-ఆర్డినేటర్ బొత్స సత్య నారాయణ సూచించారు. విశాఖ పట్నం సిరిపురంలో ఆదివారం పి.గన్నవరం నియోజవర్గకు కో-ఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాసరావు పార్టీ శ్రేణులతో బొత్స ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్యకర్తలు, నాయకులు అందరినీ సమన్వయం చేసుకుంటూ వైసిపిని ముందుకు నడిపించాలని సూచించారు. ఈ సందర్భంగా బొత్సకు శాలువ కప్పి సత్కరించారు. ఈ కార్యక్రమంలో అంబాజీపేట మండల శాఖ అధ్యక్షులు విత్తనాల ఇంద్ర శేఖర్, మామిడికుదురు సొసైటీ మాజీ అధ్యక్షులు కటకం శెట్టి ఆదిత్య, నేదునూరు పెదపాలెం మాజీ సర్పంచ్ వాసంశెట్టి తాతాజీ, తదితరులు పాల్గొన్నారు.

'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'కు తాత్కాలిక విరామం

ప్రజాశక్తి - అమలాపురం

తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల కు సంబంధించిన పట్ట భద్రుల శాసనమండలి ఎన్నికల ప్రవర్తన నియ మావళి అమలులో ఉన్నందున ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి తాత్కాలిక విరామం ప్రకటించామని కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 3వ తేదీ నుంచి మార్చి 8 వ తేదీ వరకు ప్రతి సోమవారం స్థానిక కలెక్టరేట్, మూడు రెవెన్యూ డివిజన్లు, మండల కేంద్రాలు, మున్సిపల్ కార్యాలయాల్లో నిర్వహించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక మీకోసం కార్యక్రమానికి తాత్కాలిక విరామం ప్రకటించామని ఆయన పేర్కొన్నారు. మీకోసం ఆన్లైన్ పోర్టల్లో అర్జీదారులు తమ తమ సమస్యలను రాత పూర్వకంగా నమోదు చేసుకోవచ్చునని లేదా సమీప గ్రామ లేదా వార్డు సచివాల యాల ద్వారా ఆన్లైన్లో అర్జీలు నమోదు చేయించుకొన వచ్చునని కలెక్టర్ సూచించారు.

సుబ్బారావుకు కళాకిరీటి పురస్కారం

ప్రజాశక్తి - కొత్తపేట


కవి, నటుడు, అధ్యాపకుడు, పాత్రికేయుడు డాక్టర్ వివివిఎస్.సుబ్బారావు కళా కిరీటి పురస్కారాన్ని అందుకున్నారు ఎపి భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో గోదావరి కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మలికిపురం అల్లూరి సత్యనారాయణ రాజు ఫంక్షన్ హాల్‌లో ఆదివారం సాంస్కృతిక కళా సంబరాలు నిర్వహించారు. శ్రీ శ్రీ కళావేదిక అంతర్జాతీయ ఛైర్మన డాక్టర్ కత్తిమండ ప్రతాప్ సంస్థ జాతీయ అధ్యక్షురాలు కొల్లి రమావతి, గోదావరి కల్చరల్ అసోసియేషన్ అధ్యక్షులు సిహెచ్.రామారావు సంస్థ ఉపాధ్యక్షుడు కడలి కృష్ణారావు చేతుల మీదుగా సుబ్బారావు పురస్కారాన్ని అందుకున్నారు. సమకాలీన రైతు సమస్యలపై తాను రచించి అభినయించిన రైతే రాజు ఏకపాత్రాభినయానికి ఈ పురస్కారం లభించింది.



సుబ్బారావుకు పురస్కారం అందజేస్తున్న ప్రముఖులు

ఎల్. గన్నవరం సర్పంచ్ మృతి

ప్రజాశక్తి - పి.గన్నవరం



సర్పంచ్ రామకష్ణ(ఫైల్)

ప్రమాదంలో గాయపడిన లంకల గన్నవరం సర్పంచ్ పసలపూడి రామకృష్ణ (46) రాజమహేంద్రవరం ప్రయివేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మతి చెందారు. ఈ నెల 5 న తాడేపల్లిగూడెం నుంచి వస్తూ బెల్లంపూడి సమీపంలో బైక్‌తో సహా పంట కాలువలో ఆయన పడిపోయారు. స్థానికులు స్పందించి కుటుంబ సభ్యులకి సమాచారం అందించి పి.గన్నవరం ఏరియా ఆసుపత్రిలో చేర్చగా మెరుగైన వైద్యం కోసం రాజమహేంద్రవరం తరలించారు. ఆయనకు భార్య సీతారత్నం, కుమారుడు, కుమార్తె ఉన్నారు. 2021 స్థానిక సంస్థల ఎన్నికల్లో జనసేన తరఫున పోటీ చేసి సర్పంచిగా ఆయన గెలుపొందారు. వరదల సమయంలో ప్రజలకు ఎన్నో సేవా కార్యక్రమాలు చేసి ప్రజల మన్ననలు పొందారు. ఆయన మృతితో గ్రామంలో విషయులు అలుముకున్నాయి. సర్పంచ్ పసలపూడి అకాల మృతికి చింతిస్తూ ఎంఎల్ఎ గిడ్డి సత్యనారాయణ, రాష్ట్ర నాయకులు డొక్కానాథ్ బాబు, ఆరుమిల్లి లాల్ బాబు, ఎంపిపి గనిశెట్టి నాగలక్ష్మి శ్రీనివాస్, జనసేన రాష్ట్ర నాయకులు వాసంశెట్టి కుమార్, ఉమ్మడి జిల్లా జనసేన ఉపాధ్యక్షులుశిరిగినీడి వెంకటేశ్వరరావు, నియోజకవర్గం సర్పంచుల సమాఖ్య అధ్యక్షులు యర్రంశెట్టి వీరాస్వామి, మామిడికుదురు సర్పంచ్ ల సమాఖ్య అధ్యక్షులు అడబాల తాత కాపు,కూటమి నాయకులు సంతాపం వ్యక్తం చేశారు.